# న్యాయ పూర్తి వివరణ

న్యాయ పరిధి : మహిళా చట్టాలు
సెక్షన్ పరిధి : హిందూ వివాహ చట్టం 1955
ఉప సెక్షన్ పరిధి : దాంపత్య హక్కుల పునరుద్ధరణ

## సంక్షిప్తంగా న్యాయ సమాచారం

భార్య భర్తలిద్దరు ఒకరితో ఒకరు కలిసి మెలిసి సహజీవనము చేయాలన్నది న్యాయశాస్త్ర ముఖ్య ఉద్దేశ్యము. తగినంత కారణము లేనిదే భార్యా భర్తలు ఒకరినొకరు వీడి ఉండరాదు. ఒక వేళ భార్యగాని భర్తగాని కారణము లేకుండా వేరుగా ఉంటే, ఆ రెండవ వారు మొదటి వారిని కాపురము చేయుటకు పంపమని కోరుతూ కోర్టులో పిటిషను దాఖలు చేయవచ్చు.

## విపులంగా న్యాయ వివరాలు

దాంపత్య పునరుద్ధరణ కోసం పిటిషను దాఖలు చేయడానికి అట్టి వివాహము చెల్లదగిన వివాహమై ఉండాలి. మొదటి భార్య బతికుండగా రెండవ వివాహము భర్త చేసుకుంటే, అట్టి రెండవ వివాహము చెల్లదు కనుక సదరు రెండవ భార్యకు ఈ సెక్షను వర్తించదు ( రంజనా కేజ్రీవాల్ v వినోద్ కుమార్ క్రేజీవాల్ AIR 1997 Bom 380)

టి. సరిత v టి. వెంకట సుబ్బయ్య (AIR 1983 AP 356) కేసులో, రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛను ఈ సెక్షను హరిస్తుంది కాబట్టి ఈ నిబంధనను రద్దు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో దావా దాఖలు అయింది. జస్టిస్ పి.ఏ. చౌదరీ పిటిషనరు వాదనలతో అంగీకరిస్తూ, ఈ సెక్షను రాజ్యాంగమునకు విరుద్ధముగా ఉన్నదని ప్రకటించారు.

సుప్రీం కోర్టు మాత్రం హైకోర్టు తీర్పును కొట్టివేస్తూ, దాంపత్య జీవితంలో రాజ్యాంగ అధికరణాలైన 14 మరియు 21కు తావు లేదని, ఈ సెక్షను ముఖ్య ఉద్దేశ్యము విడిపోయిన జంటను తిరిగి కలపడమేనని వెల్లడించింది.

## పరిష్కార పద్ధతి

## సెక్షన్ పేరు

సెక్షను 9, హిందూ వివాహ చట్టం, 1955

## ఫిర్యాదు ఎవరికి ఇవ్వాలి / ఎక్కడ ఇవ్వాలి ?

ఈ క్రింది పరిధిలో ఉన్న పౌరకోర్టులో దావా వేయవచ్చు

a. వివాహము జరిగిన చోట

b. భార్యా భర్తలిద్దరు కలిసి నివసిస్తున్న చోట

c. భార్యా భర్తలిద్దరు ఇది వరకు కలిసి నివసించిన చోట.

## కేసు ఫైల్ చేయడం ఎలా ?

దాంపత్య పునరుద్ధరణ కోరుతూ సదరు పౌరకోర్టులో పిటిషను దాఖలు చేయాలి

- పునరుద్ధరణ కోరుతున్న వ్యక్తి ఈ క్రింది విషయాలను రుజువుచేయాలి.
  a. తన జీవిత భాగస్వామి తన నుండి విడిపోయినదని.
  b. విడిపోవడానికి తగిన కారణాలు ఏవీ లేవని.
  c. తన వైపునుండి ఎటువంటి అపరాధము చేయలేదని, కాబట్టి పునరుద్ధరణ కోరడానికి అతను అనర్హుడుకాడని.

జీవిత భాగస్వామి నుండి దూరంగా ఉంటున్న వ్యక్తి, అలా ఉండడానికి గల కారణాలను తెలిపి, రుజువు చేయాల్సి ఉంటుంది.

సదరు భార్యగాని భర్తగాని తనపట్ల కౄరంగా వ్యవహరిస్తున్నారని, హింసిస్తున్నారని, ఆమె లేదా అతనితో జీవించలేకపోతున్నానని దూరముగా ఉంటున్న వ్యక్తి సముచిత కారణాలను చూపించవచ్చు. కోర్టువారు వాది ప్రతి వాదులు చెప్పిన విషయాలను నిజ నిర్థారణ చేసి, ప్రతివాది తన జీవిత భాగస్వామి నుండి దూరంగా ఉండడానికి బలమైన కారణాలు ఏవీ లేవని భావిస్తే, దాంపత్య పునరుద్ధరణకై డిక్రీ జారీ చేస్తారు.

## తరువాత

పౌర ప్రక్రియ చట్టం ప్రకారం ఈ డిక్రీ అమలు చేయడం జరుగుతుంది. పౌర కోర్టు ఉత్తర్వుల పై హైకోర్టుకు ఆ పై సుప్రీం కోర్టుకు అప్పీలు చేసుకోవచ్చు.

## ప్రత్యామ్నాయ పరిష్కారం

న్యాయసేవా అధికార సంస్థలను ఆశ్రయించి కోర్టుకు వెళ్ళకుండా న్యాయం పొందవచ్చు. ఏదైన స్వచ్ఛంద సంస్థవారి సేవలను కూడా పొందవచ్చు.